సాక్షి
ఒడిశా

మంగళవారం, 27, ఆగస్టు, 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,01,480లు, బంగారం 12 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి 67 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

మల్కన్‌గిరి జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితిలో ఎలుగు దాడిలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

- 8లో

అధ్యక్షుడిగా కులవర్ధనరావు

పర్లాకిమిడి: స్థానిక నగరంపల్లి వీధిలో శ్రీకృష్ణ యాదవ కుల సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అధ్యక్షుడిగా ఎ.కులవర్ధనరావు, ఉపాధ్యక్షుడిగా బి.ప్రసాద్, కార్యదర్శిగా డి.లోకేష్, కోశాధికారిగా ఎం.బాబూరావు, కార్యవర్గ సభ్యుడిగా యస్.లక్ష్మణరావు ఎన్నికైనట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

సీఎం దృష్టికి గుణుపూర్ సమస్యలు



సీఎం మోహన్‌చరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌కు చెందిన బీజేపీ నాయకుల బృందం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని సోమవారం కలిసింది. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించిన ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రిలో వైద్యుల కొరత నివారించాలని కోరారు. అదేవిధంగా పాణిడొంగొరొ ఎత్తిపోతల సాగునీటి పథకం నిర్మాణం పూర్తయితే, ఈ ప్రాంత భూములు సస్యశ్యామలమవుతాయని వివరించారు. సీఎంను కలిసినవారిలో బీజేపీ రాష్ట్ర శాఖ ఎస్సీ, ఎస్టీ మోర్చ కార్యదర్శి విద్యాధర్ సాబొరొ, సభ్యుడు అమర్ కుమార్ సాహు తదితరులు ఉన్నారు.

'ఆదివాసీ భాషలో పాఠాలు బోధించాలి'



సీఎం మోహన్ చరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిద్యులత హుయిక తదితరులు

రాయగడ: ఆదివాసీ భాష, సంస్కృతిని కాపాడాలని, దీనికోసం అంగన్‌వాడీల్లో నిర్వహిస్తున్న శిశు పాఠశాలల్లో ఆదివాసీ భాషలో పాఠాలు బోధించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆదివాసీ మంచ్ కన్వీనర్ బిద్యులత హుయిక కోరారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలో ఆదివాసీల బృందం సీఎం మోహన్ చరణ్ మాఝిని సోమవారం రాజధానికిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసీల మాతృభాషల్లోనే విద్యార్థులకు పాఠాలు బోధించాలని కేంద్ర ప్రభుత్వం 2013 నియమాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, అది ఇంతవరకు కార్యరూపం దాల్చడం లేదని పేర్కొన్నారు. గత బీజేడీ ప్రభుత్వ హయాంలో ఆదివాసీ భాషలో పుస్తకాలను ముద్రించి, ఆదివాసీ భాషల్లో పాఠాలు బోధించాలనే ఉద్దేశంతో కొంతమందికి శిక్షణ ఇచ్చినా అది అమలు కాలేదని వివరించారు. ఈ నేపథ్యంలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆదివాసీ భాష, సంస్కృతిని పరిరక్షించడంతో పాటు విద్యా విధానంలో పిల్లలకు ఆయా భాషల్లోనే బోధనకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో మూతబడిన పాఠశాలలు మళ్లీ తెరవాలని కోరారు. జంగ్, జమి పట్టాల పంపిణీ, నిర్వాసితులకు పునరావాసం కల్పన తదితర సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ప్రేమ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ జాకబ్ తుంటిలి, ఇగ్నో కేంద్రీయ డైరెక్టర్ గురు ప్రసాద్, ఒడిశా ఆదివాసీ మంచ్ ముఖ్య సలహాదారుడు బాదల్ కుమార్ ఝా, కంధమాల్ జిల్లా కన్వీనర్ సుధీర్ దిగాల్, సంతోష్ సాహు తదితరులు ఉన్నారు.

'ఉమ్మర్‌కోట మీదుగా రైల్వేలైన్ నిర్మించాలి'



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రమేష్ మజ్జి


కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం నుంచి కలహండి జిల్లా వరకు నిర్మించనున్న నూతన రైల్వేలైన్‌ని ఉమ్మర్‌కోట్ పట్టణం మీదుగా నిర్మించాలని నబరంగ్‌పూర్ జిల్లా బీజేడీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ మజ్జి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉమ్మర్‌కోట్ సమీపంలోని తన నివాసంలో శనివారం మీడియా సమావేశంలో ప్రసంగించారు. గతంలో నవీన్ పట్నాయక్ హయాంలో నబరంగ్‌పూర్-జయపూర్, జయపూర్-మల్కన్‌గిరిల మధ్య రైల్వేలైన్ నిర్మాణం కోసం కృషి చేసిన విషయం గుర్తు చేశారు. కొద్దిరోజుల క్రితం నబరంగ్‌పూర్-జునాగడ్‌ల మధ్య రైల్వే లైన్ నిర్మాణం కోసం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అయితే ఈనెల 23న కలహండి జిల్లా ధర్మగడ్‌లో జరిగిన సభలో నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి మాట్లాడుతూ ఈ లైన్ ధర్మగడ్ మీదుగా వెళ్తుందని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. నబరంగ్‌పూర్ ఎంపీ తన సొంత నియోజకవర్గానికి చెందిన ఉమ్మర్‌కోట్ మీదుగా ఈ లైన్ కోసం డిమాండ్ చేయాలన్నారు. ఈ నిర్మాణం నబరంగ్‌పూర్, డాబుగాం, ఉమ్మర్‌కోట్, జొరిగాం, చందాహండి, ధర్మగడ్‌ల మీదుగా జునాగడ్ వరకు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ నిర్మాణంపై ఉమ్మర్‌కోట్ ప్రాంతానికి న్యాయం చేయాలని కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ శ్రీవైష్ణవ్, నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జిలకు రమేష్ మజ్జి విజ్ఞప్తి చేశారు.

మంచంపట్టిన.. నారాయణపట్న

- డెంగీతో ఇద్దరు మృతి
- జ్వరం బారిన దాదాపు 50 మంది
- విశాఖ, పార్వతీపురంలలో చికిత్స



నారాయణపట్నలో వైద్యాధికారులతో చర్చిస్తున్న జెడ్పీ అధ్యక్షురాలు సస్మితా మెలకా



మృతి చెందిన వ్యాపారి శివాజీ(ఫైల్)

కొరాపుట్: జిల్లాలోని నారాయణపట్న సమితి డెంగీతో మంచంపట్టింది. ఈ వ్యాధితో గత రెండు రోజుల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. నారాయణపట్న మెయిన్ రోడ్డులో నివాసముంటున్న బి.శివాజీ (55) అనే వ్యాపారికి ప్లేట్‌లెట్స్ తక్కువ అవ్వడంతో ఆంధ్రా తరలించినప్పటికీ మృతి చెందాడు. అలాగే భౌరీ వీధికి చెందిన ఎ.సరస్వతి (42) కూడా డెంగీతో మృతి చెందింది. ఇంకా సుమారు 50 మంది జ్వరం బారినపడి చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో అత్యధికంగా పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం, విశాఖపట్నంలలో చికిత్స తీసుకుంటున్నారు.

వైద్యశాఖ అప్రమత్తం

డెంగీతో ఇద్దరు మృతి చెందడంతో జిల్లా వైద్యశాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు డెంగీ జ్వరంపై ప్రచార రథంతో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వీధుల్లో ఫాగింగ్ చేయిస్తున్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా నారాయణపట్న ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో పరిస్థితిపై సమీక్షించారు. వైద్యాధికారి బిమల్ బాగ్ తాము తీసుకుంటున్న చర్యలను వివరించారు. బాధితుల రక్త నమూనాలను సత్వరం పరీక్ష చేస్తే రోగులకు చికిత్స చేయడం వేగంగా ప్రారంభించవచ్చని ఆమె పేర్కొన్నారు. పరిస్థితి విషమిస్తుండడంతో సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వైద్య బృందం నారాయణపట్న వెళ్లింది. సమితిలో 20 మంది వైద్యులు పని చేయాల్సి ఉండగా, కేవలం ఐదుగురు వైద్యులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.



బాధిత ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

రైలు ఢీకొని పశువులు మృతి



ట్రాక్‌పై పడివున్న ఆవు కళేబరం



చనిపోయిన మేకలు

కొరాపుట్: రైలు ఢీకొని 6 ఆవులు, 15 మేకలు మృత్యువాత పడిన ఘటన కొత్తవలస కిరండోల్ రైల్వే లైన్ కొరాపుట్ నుంచి అరకు మార్గంలో మాచ్‌ఖండ్ రోడ్-బేజా స్టేషన్ల మధ్య హండి పుట్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. హండిపుట్ గ్రామానికి చెందిన ఒకరైతు పశువులు రైల్వే లైన్ దాటడానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఇదే సమయంలో విశాఖపట్నం నుంచి కిరండోల్ వైపు గూడ్స్ రైలు వెళ్తోంది. రైలు చూసిన పశువుల కాపరులు పశువులను పక్కలైన్‌పైకి మరలించారు. అదే సమయంలో కిరండోల్ నుంచి విశాఖ వైపు వస్తున్న గూడ్స్ రైలు పశువులను ఢీకొట్టుకుంటూ వెళ్లి పోయింది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఆవులు, మేకలు మృతి చెందాయి. దీంతో గిరిజనులు పెద్ద ఎత్తున ట్రాక్ వద్దకు వచ్చి ఆందోళన చేశారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని భద్రత చర్యలు తీసుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వంద మీటర్ల దూరంలోనే ఒక అండర్ పాస్ రైల్వే వంతెన ఉంది. కానీ గిరిజనులు ఆ మార్గం గుండా పశువులు తీసుకొని వెళ్లకుండా ట్రాక్‌పై నుంచి తీసుకురావడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

బంగారం చోరీ

పర్లాకిమిడి: బరంపురం పట్టణంలోని నిమాఖండి పోలీసుస్టేషన్ పరిధి శ్రీక్షేత్ర విహార్‌లో అజిత్ పాఢి అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. దీనిలో భాగంగా పెద్ద ఎత్తున బంగారం, డబ్బు దోచుకున్నారు. తాను ఇంట్లో లేని సమయంలో దొంగతనం జరిగినట్లు బాధితుడు నిమాఖండి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పర్లాకిమిడి: బరంపురం సదర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం గుంటబోంధో వద్ద రెండు గ్రూపుల యువకులు మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డారు. పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో నారాయణ జెన్నా తలకు తీవ్ర గాయాలవ్వడంతో ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. ఎనిమిది మంది యువకులు నారాయణ జెన్నాపై దాడి చేసినట్లు అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. గుంటబొంధో ఏరియా పరిధి సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు తనిఖీ చేసిన తర్వాత ఇది రెండు గ్రూపుల తగాదాగా గుర్తించారు. బరంపురం సదర్ పోలీసుస్టేషన్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

కొరాపుట్: గంజాయి అక్రమ రవాణాని పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితి సిలాటి గ్రామానికి చెందిన నవజిత్ సర్కార్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక పికప్ వ్యాన్‌లో గంజాయి తరలిస్తుండగా సమీప చత్తీస్‌ఘడ్ రాష్ట్రం కొండాగాం జిల్లా ఫార్స్‌గాం వద్ద ఆ రాష్ట్ర పోలీసులు ఈ వ్యాన్‌ని తనిఖీ చేశారు. అందులో 121 కేజీల గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి గంజాయిని సీజ్ చేశారు.

వీకే పాండియన్ పేరుతో వసూళ్లు

- రమేష్ రౌత్ అనే వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు



అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి పోలీసులు వీకే పాండియన్ బావమరిది అని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కేంద్రపడ జిల్లాకు చెందిన రమేష్ రౌత్ అనే బీజేడీ కార్యకర్త తాను వీకే పాండియన్ భార్య సుజాత కార్తికేయన్ తమ్ముడినని కొంతమందిని నమ్మించాడు. దీనిలో భాగంగా గత ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల నుంచి సుమారు రూ.2 కోట్లు వరకు వసూలు చేశాడు. దీంతో మోసపోయిన బాధితులు ఇటీవల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ నితీష్ వాద్వానీ స్పందించి ఆరా తీస్తే కేంద్రపడలో నిందితుడు ఉన్నట్లు సమాచారం వచ్చింది. దీంతో మత్తిలి పోలీసుల బృందం ఆదివారం కేంద్రపడ వెళ్లి అతడిని అరెస్టు చేసి, మల్కన్‌గిరికి సోమవారం తీసుకొచ్చారు. అనంతరం అతడిని విచారించగా అతడితో పాటు ఈ స్కామ్‌లో మత్తిలి సమితి జిల్లా పరిషత్ సభ్యురాలు సుస్మితా మాఝి పాత్ర కూడా ఉన్నట్లు తెలిసింది. ఇంకా దీని వెనుక ఎవరెవరు ఉన్నారో తేలాల్సి ఉంది.

నేడు కలెక్టరేట్ ముట్టడి



కొరాపుట్ జిల్లాలో నాగేశ్వరి గుహలు

కొరాపుట్: జిల్లాలో బాక్సైట్ గనుల తవ్వకాలపై వివాదాలు చెలరేగుతున్నాయి. పొట్టంగి నియోజకవర్గంలోని నందపూర్ సమితిలో ఉన్న మా నాగేశ్వరి పర్వత బచావ్ అభియాన్ కమిటీ మరో ఉద్యమానికి తెరతీసింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ముట్టడిస్తామని ప్రకటించింది. వివరాల్లోకి వెళ్తే.. బల్ద ప్రాంత గిరిజనుల ఇష్ట దేవత నాగేశ్వరి. అక్కడ 5 గ్రామ పంచాయతీల పరిధిలో బల్దా కొండలు ఉన్నాయి. వాటిని తవ్వి బాక్సైట్ తరలించుకోవడానికి అదానీ కంపెనీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

2018లో అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నాగేశ్వరి గుహలను పర్యాటక రంగంలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అయినా గిరిజనులు గనులు తవ్వడానికి గ్రామసభలకు అనుమతి ఇవ్వలేదు. అప్పటి నుంచి ఇక్కడ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గిరిజనులు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝీని కలిసి గుహలను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆందోళనకారులు కొరాపుట్ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ముట్టడిస్తామని ప్రకటించారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



మల్కన్‌గిరి: కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

జయపురం: వెన్న దొంగిలించి ఆరగిస్తున్న కృష్ణుడు

నల్లనయ్య జన్మాష్టమి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. కన్నయ్య, గోపికల వేషధారణల్లో చిన్నారులు ముద్దులొలికించారు. గోవర్ధన గిరిధారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్

అల బృందావనంలో..!



పర్లాకిమిడి: శ్రీనృసింహనాథ స్వామి మందిరం వద్ద...



జయపురం: ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి ఉత్సవాలు



పర్లాకిమిడి: కాదంబనీ చెట్టుపై శ్రీకృష్ణుడు, చెట్టుకింద రాధా గోపికలు



జయపురం: సరస్వతీ శిశు మందిర్‌లో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



రాయగడ: కోలాటమాడుతున్న మహిళలు



పర్లాకిమిడి: వేషధారణల్లో అలరిస్తున్న చిన్నారులు



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యా మందిర్ పాఠశాల ఆవరణలో...



రాయగడ: వేషధారణల్లో చిన్నారులు



జయపురం: కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు

ఈనెల 28, 29న నిరసనలు



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రమోద్ కుమార్

జయపురం: మూతపడిన గగనాపూర్ సేవా పేపర్ మిల్లు తెరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 28, 29 తేదీల్లో రాష్ట్ర రాజధానిలోని అసెంబ్లీ వద్ద నిరసనలు తెలపాలని మిల్లు కార్మిక సంఘం నిర్ణయించింది. ఈ మేరకు స్థానిక కార్మిక భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ ముడి సరుకు కొరత కారణంగా జూలై 20వ తేదీ నుంచి మిల్లులో ఉత్పాదన నిలిచిపోయిందన్నారు. మరలా ఎప్పుడు తెరుస్తారో తెలియని అయోమయం నెలకొందని వాపోయారు. మిల్లు ఉద్యోగులకు గత 6 నెలల నుంచి జీతాలు నిలిచిపోయాయని, అలాగే విశ్రాంత శ్రామికులకు పెన్షన్, పీఎఫ్ బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. జయపురం సబ్ డివిజన్‌లో ఏకమాత్ర బృహత్తర మిల్లు మూతపడినా యాజమాన్యంతో పాటు జిల్లా అధికారులు, ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పోరాటం చేయనిదే మిల్లు నడవదని గుర్తించామని, అందువలన రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళనలకు పిలుపునిచ్చామన్నారు. సమావేశంలో కార్మిక నేతలు బసంత బెహర, ప్రహ్లాద మల్లిక్, అలేఖ పాత్రో, శేఖ ముస్తాన్, సుభాష్ బెహర తదితరులు పాల్గొన్నారు.

ప్రసవ 'వే'దన



పుష్పాంజలిని మోసుకుంటూ తీసుకెళ్తున్న దృశ్యం

కొరాపుట్: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సుమారు 3 కి.మీ మోసుకెళ్లిన ఘటన కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి దుర్సుని గ్రామ పంచాయతీ హల్ది సీల్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన లైజర్ ఖొరా అనే వ్యక్తి భార్య పుష్పాంజలి ఖొరా అనే మహిళకి నెలలు నిండడంతో సోమవారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో అంబులెన్స్‌కు కాల్ చేశారు. అయితే గ్రామానికి వచ్చేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఊరుకు మూడు కిలోమీటర్ల దూరంలోని అంగరగుడ గ్రామం వద్ద అంబులెన్స్ నిలిచిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు గర్భిణిని స్ట్రెచర్‌పై కూర్చోబెట్టి భారీ వర్షంతోనే అంబులెన్స్ వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అంబులెన్స్‌లో ఆమె దశమంతపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుంది. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలకు సరైన రహదారి సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

అయ్యో..!



ధనమతి మృతదేహం

కొరాపుట్: చిరుతిండ్లు కొనుక్కోవడానికి డబ్బులు ఇవ్వలేదని చిన్నారి ఆత్మహత్య చేసుకున్న ఘటన నబరంగ్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పపడాహండి సమితి మైదల్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధి మజ్జిగుడ గ్రామ పంచాయతీ చరాకుట్టియా గ్రామానికి చెందిన దొయితరి ముదలి కుమార్తె ధనమతి ముదలి (10) చిరుతిండ్లు కొనుక్కోవడానికి డబ్బుల అడిగింది. అయితే తల్లి ఇవ్వనని చెప్పడంతో అలిగింది. అనంతరం కుటుంబ సభ్యులు మొక్కజొన్న పొలంలో పనికి వెళ్లిపోయారు. ఇదే సమయంలో ధనమతి ఇంటికి లోపల నుంచి తలుపులు వేసుకొని చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి మేనమామ కృష్ణ ముదలి మైదల్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



గురుబంధు రోణ మృతదేహం

కొరాపుట్: ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి ధర్నాబెడా క్రషర్ ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. డోక్రిగుడ గ్రామానికి చెందిన గురుబంధు రోణ(22) ధర్నాబెడా క్రషర్ ప్రాంతంలో రోడ్డుపై ఉండగా అటుగా వచ్చిన ట్రాక్టర్ బలంగా ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు పాలైన అతడిని స్థానికులు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి చేరుకునేసరికే గురుబంధు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి మామ రబి దొర ఫిర్యాదు మేరకు పపడాహండి ఇన్‌స్పెక్టర్ సంజులత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు



గాయపడిన శ్యామల్‌ను చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పుట్ సమితి కధంగూడ పంచాయతీ చపాల్‌పాడ్ గ్రామానికి చెందిన శ్యామల్ సీసా సమీప అడవికి కర్రల కోసం సోమవారం ఉదయం వెళ్లాడు. అనంతరం సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఒక ఎలుగుబంటి అతడిపై దాడి చేసింది. వెంటనే అతడు కేకలు వేయగా అటుగా వస్తున్న స్థానికులు వెళ్లడంతో ఎలుగుబంటి పారిపోయింది. దీంతో వెంటనే గాయపడిన శ్యామల్ సీసాను ఖోయిర్‌పుట్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. శ్యామల్‌కు అక్కడి వైద్యులు చికిత్స చేసి, అనంతరం కొరాపుట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: బొప్పాయిపురం పంచాయతీ పరిధి చల్లపేట గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న మల్లేషును హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే కుటుంబంలో వచ్చిన చిన్నపాటి తగాదా కారణంగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

ఉత్సాహంగా తైక్వాండో ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారిణులతో తైక్వాండో శ్రీను, లక్ష్మణ్, నవీన్, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక టౌన్‌హాల్ వేదికగా సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను మాట్లాడుతూ ఈ నెల 31, సెప్టెంబర్ ఒకటో తేదీల్లో తిరుపతి వేదికగా వేర్వేరు రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను ఇక్కడ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపికైన జిల్లా క్రీడాబృందాలకు కోచ్‌లుగా మజ్జి గౌతమ్, మోర్తా సాయి బాలాజీలు వ్యవహరిస్తున్నారు. తైక్వాండో నవీన్, శాప్ కోచ్ లక్ష్మణరావు, జోగిపాటి వంశీ, ఎన్.శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ పోయి ఎస్ఏ వచ్చే!

- నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్షలు
- గతంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లో రోజుకు రెండు పరీక్షల నిర్వహణ
- ఇకపై రోజుకో పరీక్ష చొప్పున నిర్వహణ
- ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు



హిరమండలం, శ్రీకాకుళం న్యూ కాలనీ: ప్రభుత్వం మారడంతోనే విద్యార్థుల పరీక్ష విధానాలు కూడా మారిపోతున్నాయి. ఇదివరకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పేరిట నిర్వహించిన యూనిట్ పరీక్షలను నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పేరిట నిర్వహించనున్నారు. గతంలో ఈ పరీక్షలను 3 రోజులు నిర్వహించే వారు. తాజాగా పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఆరురోజులు పరీక్ష నిర్వహిస్తారు. ప్రైవేటు మినహా అన్ని అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షలకు నిర్వహణ సంస్థ ద్వారా పరీక్ష పేపర్లను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

20 మార్కులకు పరీక్ష

ఇంతవరకు యూనిట్ పరీక్షల స్థానంలో నిర్వహించే ఫార్మెటివ్ పరీక్షలు 20 మార్కులకు మాత్రమే ఉండటంతో ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. దీనివల్ల సిలబస్‌పై ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. నెలవారీ సిలబస్‌లో 3 రోజులు కుదించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

టోఫెల్‌కు మంగళం

ఈ నెల 27 నుంచి వచ్చే నెల 2 వరకు ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి జూలై వరకు టోఫెల్ తరగతులు నిర్వహించారు. అయితే జూలై 15న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన 2024–25 అకడమిక్ క్యాలెండర్‌లో టోఫెల్ తరగతుల నిర్వహణపై ఎలాంటి పీరియడ్స్ కేటాయించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంత వరకు అమలవుతున్న టోఫెల్ తరగతులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడినట్లైంది.

విధానాలు మారాలి..



సెల్ఫ్ అసెసెంట్‌మెంట్ పేరిట నిర్వహించే యూనిట్ టెస్టులకు ఎందుకు ఇంత హడావుడి చేస్తున్నారో తెలియడం లేదు. గంటసేపు జరిగే పరీక్షకు రోజంతా సమయం వృథా చేయడం సరికాదు. ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా విధాన పరమైన నిర్ణయాలను ఏకపక్షంగా మార్చేస్తున్నారు. కనీసం ఉపాధ్యాయులతో చర్చించడంలేదు. దీనివల్ల ఎవరికీ ప్రయోజనం ఒనగూరదు.

– ఎండ ఉమాశంకర్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్

పనిదినాలు వృథా



సెల్ఫ్ అసెస్‌మెంట్ విధానంతో పాఠశాలల్లో విలువైన పనిదినాలు వృథా అవుతాయి తప్పిస్తే.. వాటి వల్ల ఎలాంటి ఉపయుక్తం లేదు. గతంలో మూడు రోజుల్లో పరీక్షలు పూర్తయ్యేవి. రోజుకు ఒక గంటపాటు నిర్వహించే పరీక్షలతో విద్యార్థుల కాలాన్ని వృథా చేయడమే కాకుండా, పాఠశాల పని దినాలు కూడా నిరుపయోగమవుతాయి.

– పేడాడ కృష్ణారావు, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి..



ఎస్‌సీఈఆర్టీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్షలు ఈనెల 27 నుంచి మొదలవుతాయి. గతంలో మాదిరిగా కాకుండా రోజుకు ఒక పరీక్ష చొప్పున ఉంటాయి. డీసీఈబీ నుంచి ప్రశ్న పత్రాలను సిద్ధం చేయించాం. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అన్ని యాజమాన్య పాఠశాలలు విధిగా పాటించి అమలు చేయాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

మద్యం తాగవద్దు అన్నందుకు..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- వంశధార కాలువలో మునిగి గల్లంతు
- గాలిస్తున్న పోలీసులు



సంఘటన స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు



గల్లంతైన దుర్గాప్రసాద్ (ఫైల్)

హిరమండలం: చిన్నప్పుడే తండ్రి చనిపోతే.. అన్నీ తానే అయి అమ్మ పెంచి పెద్ద చేసింది. ఆలనపాలన చూసుకుని బిడ్డల బాధ్యత తను భుజానికెత్తుకుంది. కానీ ఆ తల్లి మద్యం తాగవద్దు అని అన్నందుకు కుమారుడు ఏకంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వంశధారలో మునగడంతో ఇప్పటివరకు ఆచూకీ తెలియలేదు. దీంతో ఆ తల్లి పేగు తల్లడిల్లిపోతోంది. హిరమండలం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హిరమండలం మైత్రి కాలనీలో జోగి సావిత్రి తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసముంటోంది. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడే భర్త చనిపోయారు. పెద్ద కుమారుడు జోగి దుర్గాప్రసాద్ మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజూ తాగి ఇంటికి వస్తుండడంతో మంచి పద్ధతి కాదు నాయనా అని చెప్పింది. అయినా ఇటీవల మద్యం తాగుతుండడంతో సోమవారం గట్టిగానే మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన దుర్గాప్రసాద్ వంశధార కుడి కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాలువలో దూకిన తర్వాత అతని ఆచూకీ తెలియరాలేదు. కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, స్థానిక ఎస్ఐ జి.నారాయణ స్వామి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లను తెప్పించి వెతికే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనతో హిరమండలంలో విషాదం నెలకొంది.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని డేఅండ్ నైట్ సమీప నాగావళి కొత్త వంతెనపై ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ వరదరాజులు తెలిపిన వివరాల మేరకు.. రణస్థలం మండలం దేరసాం గ్రామానికి చెందిన కడగళ్ల నారన్నాయుడు తన మేనకోడలు బొంతు యశోద ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటీలో చదువుతుండటంతో క్యాంపస్‌కెళ్లి అనుమతిపై బయటకు తీసుకొచ్చారు. రాజమండ్రిలో ఉన్న తన బావగారింటికి యశోదను చేర్చేందుకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో బస్ ఎక్కించేందుకు బయల్దేరారు. కొత్త బ్రిడ్జికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టి తక్షణమే పరారయ్యాడు. రోడ్డుపై పడి ఉన్న ఇద్దరినీ మనోహర్ అనే వ్యక్తి 108 ద్వారా మెడికవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. నారన్నాయుడుకు కాలు ఫ్రాక్చర్ కావడంతో పాటు చేతి వేళ్లకు తీవ్రగాయాలు కాగా, యశోదకు కంటి కింద, కుడి కాలికి గాయాలయ్యాయి. దీనిపై సీసీటీవీ ఫుటేజీలో ప్రమాద దృశ్యాలు పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు అవసరం



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏపీఐఎఫ్ ప్రతినిధులు, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకు మారుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యారంగంలో సంస్కరణలు జరగాల్సిన అవసరం ఉందని ఏపీ ఇంటలెక్చువల్స్ ఫోరం(ఏపీఐఎఫ్) జోనల్ అధ్యక్షులు సురంగి మోహనరావు తెలిపారు. ఏపీఐఎఫ్ జిల్లా యూనిట్ తొలి కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా సురంగి మాట్లాడుతూ నాణ్యమైన, విలువలతో కూడిన విద్యని అందించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయగలమని అన్నారు. విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, ప్రాథమిక విద్యను బలోపేతం చేసి, మాతృభాష తెలుగు, జాతీయ భాష హిందీ, ఆంగ్ల భాషలకు సమాన ప్రాధాన్యతను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విద్యను అందించడం అవసరమన్నారు. విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలపై అఖిల భారతీయ తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, డాక్టర్ ముట్నూరు ఉపేంద్రశర్మ, పూడి జనార్దనరావు, పొట్నూరు వెంకట్రావు, తెరవీ కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పిసిని చంద్రమోహన్‌ను అతిథులు, అధికారులు సత్కరించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పొట్నూరు వెంకటరావు, సభ్యులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కోనే శ్రీధర్, ఎంవీ మల్లేశ్వరరావు, బస్వా జగన్నాథరావు, సురేష్, మణికంఠ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఎల్పీ సెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న విశ్రాంత డీఈఓ బి.మల్లేశ్వరరావు, పక్కనే చంద్రమోహన్, సురంగి, కోనే

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ ఎల్పీసెట్ (భాషా పండిత ప్రవేశ పరీక్ష) నోటిఫికేషన్ విడుదల చేసి, హిందీ పండిత శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలు నిర్వహించాలని హిందీ మంచ్ జిల్లాశాఖ అధ్యక్షుడు దొంతం పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కనుగుల సత్యం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో సోమవారం హిందీ మంచ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ సంఘ జిల్లాశాఖ అధ్యక్షుడు దొంతం పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి హైస్కూల్ ప్లస్ (జూనియర్ కాలేజీ)ల స్థాయి వరకు అన్ని పాఠశాలల్లో మిగతా సబ్జెక్టులతో సమానంగా హిందీ పండిట్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. విశ్రాంత జిల్లా అధికారి సురంగి మోహనరావు మాట్లాడుతూ, డీఎస్సీలో ఎక్కువ సంఖ్యలో హిందీ పండిట్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

మదర్ థెరిస్సా సేవలు మరువలేనివి



మదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మారెడ్డి

జయపురం: ప్రజలకు మదర్ థెరిస్సా చేసిన సేవలు మరువలేనివని జయపురం మున్సిపల్ కౌన్సిలర్ పి.పద్మారెడ్డి అన్నారు. సోమవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా స్థానిక ఎంజీ రోడ్డులో చిరంజీవి కల్చరల్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశంలో ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువ సమాజ్ ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు వై.శ్రీనివాస ఖన్న, సీవా సభ్యుడు కె.మోహన్‌రావు, తెలుగు సాంస్కృతిక సమితి మాజీ కార్యదర్శి పి.మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గుడ్ మార్నింగ్ బ్రహ్మపుర



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

కొరాపుట్: బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్ నగరంలోని 1, 2 వార్డుల్లో గుడ్ మార్నింగ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఉదయం తొలుత 2వ నంబర్ వార్డులో పర్యటించి రోడ్ల నాణ్యత, నీటి కుంటలు, డ్రైనేజీలు, మురుగు కాలువలు, విద్యుత్ స్తంభాలు, సామాజిక భవనాల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం బొడ బజార్‌కి చేరుకొని అక్కడ ట్రాఫిక్ సమస్యల కోసం స్థానికుల విజ్ఞప్తులు విన్నారు. హరడాఖండి జంక్షన్, జగబందు స్కూల్ ఏరియా ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని పోలీసులకు సూచించారు. ముక్తేశ్వర్ మందిరం దర్శించి అక్కడ ఉన్న చెరువు పరిశుభ్రత, పక్కనే ఉన్న చెరువులో కాలుష్యం, నిరుపయోగంగా ఉన్న జిమ్ పరిశీలించారు. అనంతర వార్డు నంబర్ 1లో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

‘పార్టీ తరఫున అండగా ఉంటాం’



ఆమదాలవలస: వంజంగిలో రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని



పొందూరు: మృతుడు ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాద ఘటన బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపిందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బాధిత కుటుంబాలను సోమవారం తమ్మినేని పరామర్శించారు. ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పలకరించి మృతుని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆయా కంపెనీల నిర్వహణ విషయంలో భద్రతాపరమైన చర్యలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న పరిశ్రమలను గుర్తించి వాటిలో భద్రతా లోపాలను గుర్తించాలని, ఇందుకు ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు. ఇప్పటికే తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంఘటన జరిగిన తీరుపై ఆరా తీశారన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు పార్టీలకు అతీతంగా ఆయా కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలవాలని తమ్మినేని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, జెడ్పీటీసీ బెండి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన హంస ప్రశాంత్ కుటుంబాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించారు. మృతుని తల్లి, భార్య, కుటుంబాన్ని ఓదార్చారు. కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాడు నాగరాజు, కిల్లాన సూర్యారావు, బాడాన సునీల్, వండాన సూరపునాయుడు, పప్పల రాధాకృష్ణ, అనకాపల్లి గోవింద, సత్తిబాబు, రమణమ్మ, అనకాపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ అధికారుల కేసు దర్యాప్తు వేగవంతం

శ్రీకాకుళం క్రైమ్ : జీఎస్టీ అధికారులమని చెప్పి ముగ్గురు మీడియా ప్రతినిధులు స్వీట్ల వ్యాపారిని బెదిరించి రూ. 2 లక్షలు తీసుకుని మోసగించడమే కాకుండా కులం పేరుతో దూషించిన కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాలతో రెండో పట్టణ పోలీసులే కాక జీఎస్టీ అధికారులు సైతం ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో జిల్లాకేంద్రంలో ప్రస్తుతం ఈ కేసు హాట్‌టాపిక్‌గా మారింది. దళిత వ్యక్తిని బెదిరించిన నేపథ్యంలో ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు కావడంతో ఈ కేసును కాశీబుగ్గ డీఎస్పీ పాత్రుని శ్రీనివాసరావుకు దర్యాప్తు బాధ్యతలు ఎస్పీ అప్పగించారు. శ్రీకాకుళం నూతన డీఎస్పీ ఇంకా బాధ్యతలు స్వీకరించకపోవడంతో కాశీబుగ్గ డీఎస్పీకి కేసు అప్పగించారు.

మీడియా అనే గౌరవంతో..

మీడియా అనే గౌరవంతో ఫిర్యాదు అందిన నాలుగు రోజులైనా కేసు నమోదు చేయకుండా తీసుకున్న డబ్బులు బాధితునికి ఇచ్చేయమని పోలీసులు ఆ ముగ్గురికీ చెప్పారు. రాజీ చేసేందుకు ప్రయత్నించగా విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరికి బాధితుడు ఎస్పీని ఆశ్రయిస్తాననడంతో కేసు నమోదు చేశారు. కేసు నమోదైన రోజే విషయం జిల్లా జీఎస్టీ అధికారిణి రాణీ మోహన్ దృష్టికి వెళ్లడంతో శాఖాపరంగా విచారణ జరిపించారు. వ్యాపారి రాయపురెడ్డి చంద్రశేఖర్‌ని పిలిపించి అతను చెప్పిన వివరాలను నివేదిక రూపంలో జీఎస్టీ కమిషనర్‌కు అందించినట్లు సమాచారం.

‘కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఖండిస్తున్నాం’

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో ఆదివారం జిల్లా కబడ్డీ సంఘం శ్రీకాకుళం పేరిట ఏర్పడిన నూతన కార్యవర్గ ఎన్నికలను ఖండిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్(286/2014) ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవిరావు తెలిపారు. జిల్లాలో గత 40 ఏళ్లుగా కబడ్డీ క్రీడను ప్రోత్సహిస్తూ క్రీడాకారుల ఎదుగుదలకు పాటుపడుతున్న కబడ్డీ సంఘాన్ని కాదని నూతనంగా మరో సంఘాన్ని ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష భర్త, వ్యాపారవేత్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అధ్యక్షునిగా, తాను కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. కొందరు స్వార్థ పరులు పదవులపై మోజుతో కొత్తకొత్త పేర్లతో క్రీడాసంఘాలను ఏర్పాటుచేసి భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సంతలో జూదం

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు సంతలో డొక్కు ఆట ఆడుతున్న చీపురుపల్లి మండలం నిమ్మలవలస గ్రామానికి చెందిన పలువురిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ స్పెషల్ టీమ్ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7,050 నగదు, రెండు మోటారు సైకిళ్లు, టీవీఎస్ ఎక్సెల్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. లావేరు ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.

అంగరంగ వైభవంగా గోకులాష్టమి



జాలరి పాటకు సుదీర్ఘ ప్రదర్శన



ఆకట్టుకున్న వేషధారణ

కాశీబుగ్గ/పలాస: పలాస యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో పలాస వేదికగా నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. పలాస రైల్వే మైదానంలో జరిగిన కార్యక్రమం లొడగల కామేశ్వరరావు అధ్యక్షతన భగవద్గీత పారాయణం, గొల్ల చదువు గానం, తప్పెటగుళ్లు, జాలరి పాట ప్రదర్శన, కోలాటం, భరతనాట్యం, జానపదాలు, పల్లెపదాలు నృత్యాలు, సంగిడీ రాళ్ల పోటీలు అందరినీ అలరించాయి. మధ్యాహ్న సమయంలో మామిడి తాతారావు ఆధ్వర్యంలో సుమారు ఆరు వేల మందికి కృష్ణ ప్రసాదం ఏర్పాటు చేశారు. చివరిగా సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి.



నర్తు రామారావుకు సన్మానం చేస్తున్న యాదవ కుల పెద్దలు

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్, మాజీ మంత్రి గౌతుశ్యామ సుందర శివాజీలను సత్కరించారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి, వజ్జ బాబూరావు, దాసరి తాతారావు, అంబటి కృష్ణమూర్తి, వంకల కూర్మారావు, నరసింహులు పాల్గొన్నారు.



అలరించిన రేగులపాడు తప్పెటగుళ్లు నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

వ్యాసరచన పోటీలో ప్రతిభ


ప్రథమ స్థానం సాధించిన సరస్వతి

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని టి.సరస్వతి వ్యాస రచనకు జాతీయస్థాయిలో ప్రథమ స్థానం లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి సోమవారం తెలిపారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తాడేపల్లికి చెందిన డీఆర్‌జీ కళాశాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 125 మంది వ్యాసాలు రాయగా 20 మంది విజేతలుగా నిలిచారు. వారిలో తమ కళాశాల విద్యార్థిని సరస్వతి ప్రథమస్థానం దక్కించుకుందని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సరస్వతిని ప్రిన్సిపాల్‌తో పాటు తెలుగు అధ్యాపకుడు డాక్టర్ తారకేశ్వరరావు అభినందించారు.

చికిత్స పొందుతూ పరవాడ బాధితుడి మృతి


కొవ్వాడ సూర్య నారాయణ(ఫైల్)

వంగర: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని పరవాడ సెజ్‌లో ఈ నెల 23న జరిగిన ప్రమాదంలో గాయపడిన వంగర మండలం కోనంగిపాడు గ్రామానికి చెందిన యువకుడు కొవ్వాడ సూర్య నారాయణ(38) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సూర్యనారాయణ మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. హుటాహుటిన విశాఖపట్నం తరలివెళ్లారు. మృతదేహాన్ని చూసిన వారంతా కన్నీటిపర్యంతరమయ్యారు. సూర్యనారాయణ ఐదేళ్ల క్రితం బతుకుతెరువు కోసం వెళ్లి ఈ కంపెనీలో పనిచేస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు పారంనాయుడు, గౌరమ్మలున్నారు. మృతుడి భార్య 15 రోజుల క్రితం ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆమె శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

కంటైనర్ బోల్తా


అదుపుతప్పి పడిపోయిన కంటైనర్

సీతంపేట: పాలకొండ వైపు నుంచి సీతంపేట మీదుగా ఒడిశా వెళ్తున్న భారీ కంటైనర్ సోమవారం ఇసుకగెడ్డ సమీపంలో బోల్తాపడింది. అయితే కంటైనర్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, స్తంభాన్ని ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

24 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్


పట్టుబడిన గంజాయి, ఇద్దరు యువకులతో పోలీసులు

శృంగవరపుకోట: వాహన తనిఖీలు చేస్తున్న ఎస్.కోట పట్టణ పోలీసులు 24 కిలోల గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బొడ్డవర చెక్‌పోస్ట్ సమీపంలో ఎస్.కోట ఎస్సై సీహెచ్.గంగరాజు నేతృత్వంలో పోలీసులు ఆదివారం మధ్యాహ్నం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అరకు నుంచి వస్తున్న స్కూటీని ఆపి తనిఖీ చేయగా, ఆ వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తుల దగ్గర 24కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను కాకినాడకు చెందిన మజ్జి ప్రజ్వల్, ఈతకోట నానిలుగా గుర్తించి కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీఎస్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

జ్వరాలపై అప్రమత్తం

పార్వతీపురంటౌన్: జిల్లాలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. స్థానిక ఐటీడీ ఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, జ్వరాలతో బాధపడుతున్న వారంతా ప్రభుత్వ ఆస్పత్రుల కు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరా రు. జ్వరాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలు మందు లు అందుబాటులో ఉన్నాయన్నారు. జ్వరం లక్షణాలు ఉన్నట్లయితే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

- వినూత్న ఆలోచనలకు పదును పెట్టాలంటున్న ఉపాధ్యాయులు
- ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు


ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలపై విద్యార్థులకు వివరిస్తున్న డీఈఓ పగడాలమ్మ

ప్రయోగం చేసి.. ఫలితం సాధిద్దాం

పాలకొండ రూరల్: విద్యార్థులంతా వారి మేధస్సుకు పదునుపెట్టి తమలో దాగి ఉన్న అంతర్గత ప్రతిభను వేదికపై కనపర్చాలని సైన్స్ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. సృజనాత్మక ఆలోచనలు పాఠశాల స్థాయి నుంచే వినూత్న ఆవిష్కరణలు సృష్టించేందుకు దారి చూపే 'ఇన్‌స్పైర్'లో ప్రతిభ కనబరిస్తే గుర్తింపు మెండుగా ఉంటుందని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల చిట్టిబుర్రలో ఆలోచనలకు పదునుపెడితే అబ్బురపరిచేలా ప్రతిభను చూపించగలరని నిరూపించేలా గతంలో ఎన్నో ప్రాజెక్టులు జిల్లా నుంచి రూపొందాయి. ఈ కోవలో కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ అవార్డ్స్' మనాక్ పోటీలను నిర్వహిస్తుంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు, వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ పోటీలకు ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. తరగతికి ఒకరు చొప్పున పాఠశాలకు ఐదు ప్రాజెక్టులు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

సెప్టెంబర్ 15 వరకు..

వెబ్‌సైట్లలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా సెప్టెంబర్ 15 తేదీలోపు విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్ట్ వివరాలను నమోదు చేసుకోవాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థికి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్ట్ ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషికం అందిస్తారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్, జపాన్‌లో నిర్వహించనున్న సుకుర కార్యక్రమంలో ప్రదర్శనకు అవకాశం ఉంటుంది. జపాన్ సందర్శన అవకాశంతో పాటు ఇంజినీరింగ్ కళాశాల విద్యలో మెరుగైన అవకాశాలను కల్పిస్తారు. జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్‌లకు పేటెంట్ లభించే అవకాశం కూడా ఉంది.


ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్న తలవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఆ ఆలోచన ఉండాలి. తరగతులవారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, అవసరమైన ప్రాజెక్ట్‌ను రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివరాలు నమోదు చేయాలి, విద్యార్థికి సంబంధించిన బ్యాంక్ ఖాతా నంబర్, ఆధార్ వివరాలు ఇవ్వాలి. ప్రాజెక్ట్ గురించి సంక్షిప్తంగా రాత పూర్వకంగా పొందుపర్చి సంబంధిత రైటప్ వెబ్‌సైట్లలో నమోదు చేయాలి. ప్రాజెక్ట్ పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్ట్ ఎంపికను రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లాస్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం బ్యాంక్ ఖాతాలో రూ. 10 వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది.

విద్యార్థులకు సహకారం



ఈ పోటీల కోసం విద్యార్థులతో ప్రాజెక్టులను తయారు చేయిస్తున్నాం. విద్యార్థుల ఆలోచనలు తెలుసుకుని అందుకు తగినట్లుగా అద్భుతమైన ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్నాం. ఈ పోటీ విద్యార్థులకు మంచి భవిష్యత్ అందిస్తుంది. వారిలోని సృజనాత్మక ఆలోచనలు వెలికి తీసేందుకు ఇదొక గొప్ప అవకాశం. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది విద్యార్థులు మరింత స్ఫూర్తితో ప్రాజెక్టుల తయారీకి సిద్ధమంటున్నారు. నమోదు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుంది.

– జి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

ప్రతిభను ప్రోత్సహించేలా..



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి జిజ్ఞాస గల విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్ట్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. విద్యార్థులతో కలిసి ఐడియాలజీ తరగతులు నిర్వహిస్తున్నాం. హైస్కూల్స్, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల నుంచి ఐదేసి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు ప్రాజెక్టులు ఇన్‌స్పైర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

– జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం

రోగులకు అందని మందులు

- హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ బాధితుల అవస్థలు
- లివర్, కిడ్నీలు త్వరగా దెబ్బతినే ప్రమాదం
- పట్టించుకోని ప్రభుత్వం


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ వ్యాధి గ్రస్తులకు గత కొన్ని నెలలుగా మందులు అందని పరిస్థితి ఉంది. ఈవ్యాధి సోకిన వారు మందులు వాడకపోతే వ్యాధి ముదిరి తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ రోగులు 3 నెలల పాటు మందులు వాడాలి

ఈ రోగులకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో ఆర్‌ఎన్‌ఏ (రైబో న్యూక్లిక్ యాసిడ్) వైరల్‌లోడ్ పరీక్ష చేస్తారు. హెచ్‌సీవీ రోగులకు ఆర్‌ఎన్‌ఏ 10 వేల కంటే ఎక్కువగా ఉంటే మందులు వాడాల్సి ఉంటుంది. అలాగే హెచ్‌బీఎస్‌ఏజీ రోగులకు ఆర్‌ఎన్‌ఏ 20 వేల కంటే ఎక్కువగా ఉంటే మందులు వాడాల్సి ఉంటుంది. ఈవిధంగా ఉన్న రోగులు 3 నెలల పాటు మందులు తప్పక వాడాల్సి ఉంటుంది. ఈ మందులు చాలా ఖరీదైనవి కావడంతో ప్రభుత్వమే ఉచితంగా రోగులకు అందించాల్సి ఉంది. హెచ్‌సీవీ రోగికి నెలకు మందులకు రూ.18 వేలు అవుతుంది. హెచ్‌బీఎస్‌ఏజీ రోగులకు నెలకు రూ.3 వేలు అవుతుంది.

నాలుగు నెలలుగా అవస్థలు

హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ రోగులకు గడిచిన నాలుగు నెలలుగా మందులు అందడం లేదు. దీంతో ఈ వ్యాధులు సోకిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయట ఈ మందులు కొనుగోలు చేయలేని పరిస్థితి. హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ వ్యాధిగ్రస్తులకు కిడ్నీ, లివర్ త్వరగా దెబ్బతినే అవకాశం ఉంటుంది. అదే మందుల వాడితే ఆర్‌ఎన్‌ఏ వైరల్ లోడ్ తగ్గి ఆరోగ్యంగా జీవించడానికి అవకాశం ఉంటుంది.

మందుల కొరత గురించి తెలీదు

హెచ్‌సీవీ, హెచ్‌బీఎస్‌ఏజీ మందుల కొరత ఉన్న విషయం నా దృష్టికి రాలేదు. మందులు లేకపోతే తెప్పించే ఏర్పాట్లు చేస్తాం.

– డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

భగవద్గీత అనుసరణీయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు


రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు శ్రీకృష్ణభగవానుని చిత్రపటాన్ని అందజేస్తున్న సమితి ప్రతినిధులు

విజయనగరం టౌన్: సకల మానవాళికి భగవద్గీత ఎంతో అవసరమని, దీన్ని శాస్త్రబద్ధంగా చెప్పేదే త్రైత సిద్ధాంత భగవద్గీత అని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక, విజయనగరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం గురజాడ కళాభారతిలో శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ త్రైత సిద్ధాంతం రూపంలో ప్రజలకు చేరువ చేసేదే భగవద్గీత అని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుని బోధనలు తెలుసుకోవాలని, అన్ని మతాల సారాంశం ఒకటేనన్నారు. గీతా సారాంశాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఇందూ జ్ఞానవేదిక పాత్ర చాలా గొప్పదని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు వానపల్లి శంకరరావు, సమితి సభ్యులు సీవీఎస్.నాయుడు, ప్రసాద్, సూరిబాబు, ఆదినారాయణ, జగన్నాథం, వంశీ, సీతం నాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

28న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉమ్మడి విజయనగరం జిల్లా బాల, బాలికలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి కేవీఎన్ రాజు సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనబోయే క్రీడాకారులు 14 నుంచి 16 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. అదే విధంగా బాలురు 185 సెంటీమీటర్ల ఎత్తు, బాలికలు 170 సెంటీమీటర్ల ఎత్తు కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 1న విశాఖలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ కోసం పంపించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8919421590, 9550785141 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

28న పశువైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: పశుసంచార ఆరోగ్య సేవా వాహనాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇంటర్వ్యూను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు పశు సంచార ఆరోగ్య సేవా మేనేజర్ నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యుల పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కల్గిన వారు, ఉద్యోగ విరమణ చేసిన వారు అర్హులన్నారు. డ్రైవర్ పోస్టులకు 10వ తరగతితో పాటు హేవీ లైసెన్స్ కలిగి, మూడేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

కుప్పకూలినా..



విజయనగరం ఫోర్ట్: చిత్రంలో కుప్పకూలిన వృద్ధుని పేరు కోరాడ సూరి. విజయనగరం మండలం చెల్లూరు గ్రామం. రెండు రోజులుగా జ్వరంతో అస్వస్థతకు గురికావడంతో ఆయన కుమార్తె చికిత్సకోసం సోమవారం సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఓపీలో చూపించగా వైద్య పరీక్షలు చేసుకుని రావాలని వైద్యులు చీటీ రాసి ఇచ్చారు. అది పట్టుకొని ఆస్పత్రిలోని ల్యాబ్ వద్దకు వెళ్లారు. అక్కడ పావుగంట పాటు వరుసలో నిల్చొన్నారు. ఓపిక లేకపోవడంతో సూరి ఒక్కసారి కుప్పకూలిపోయారు. నాన్న కింద పడిపోయాడు.. ఒక్కసారి వచ్చి చూడండంటూ ల్యాబ్ సిబ్బందిని కుమార్తె ప్రాధేయపడినా పట్టించుకోలేదు. చివరకు అటు వైపు వెళ్తున్న వార్డుబాయ్ స్ట్రెచ్చర్ తెచ్చి క్యాజువాలిటీ (అత్యవసర విభాగం) వార్డుకు తరలించాడు. ఈ దృశ్యం చూసినవారు ల్యాబ్ సిబ్బంది తీరును దుయ్యబట్టారు. అత్యవసర పరిస్థితిలో ఉన్న రోగులను సైతం పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

పెందుర్తి:విశాఖ-అరకు రోడ్డులోని పెందుర్తి నూకాలమ్మ ఆలయం సమీపంలో సోమవా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ మండలం జాకేరు గ్రామానికి చెందిన వి.హరికృష్ణ బతుకుతెరువు కోసం పెందుర్తి వచ్చాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం బైక్‌పై పని మీద బయటకు వెళ్లిన హరికృష్ణ తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడి, తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రీ కొడుకులకు కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాలతో దహన సంస్కారం


తండ్రీకొడుకులకు దహనసంస్కారాలు చేస్తున్న కుటుంబసభ్యులు


భర్త, కుమారుడి మృతదేహాల మధ్య రోదిస్తున్న రాణీరత్నం

రేగిడి: రోడ్డు ప్రమాదంలో ఈనెల 25న శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద మృతిచెందిన తండ్రీకొడుకుల మృతదేహాలకు సోమవారం దహన సంస్కారాలు నిర్వహించారు. రేగిడి మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామానికి చెందిన కరణం రామకృష్ణ, కుమారుడు కిరణ్‌కుమార్‌ల మృతదేహాలు గ్రామానికి చేరుకోగానే గ్రామం మొత్తం ఒక్కసారిగా ఘొల్లుమంది. మృతుల కుటుంబాల ఆర్తనాదాలతో శోకసంద్రం అలుముకుంది. ఓ వైపు భర్త, మరో వైపు కుమారుడి మృతదేహాలు చూసి రాణీరత్నం గుండెలవిసేలా విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. అన్నయ్య అంటూ కిరణ్‌కుమార్ చెల్లి సాత్విక రోదించిన తీరు చూపరులను కంటతడిపెట్టించింది. రాఖీ కట్టి అండగా ఉంటానని చెప్పి అంతలోనే అనాథను చేస్తావా అంటూ గగ్గోలు పెట్టింది. తన తండ్రి మృతదేహాన్ని పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చింది. ఈ విషాదఘటన చూసిన అక్కడున్నవారి కళ్లు చెమర్చాయి. తండ్రీకొడుకుల మృతదేహాలు గ్రామానికి చేరుకున్నాయని తెలిసిన వెంటనే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వారి అంతిమయాత్రలో పాల్గొని, కన్నీటి వీడ్కోలు పలికారు. తండ్రీకొడుకులకు మృతదేహాలకు పక్కపక్కనే చితి పేర్చి దహనంచేసిన దృశ్యం పలువురిని కలిచివేసింది.

గంజాయి కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసుల్లో నిందితుల లింకులను ఛేదించేందుకు, నిందితులను పట్టుకునేందుకు ఎస్‌ఐల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వారిని ఇతర రాష్ట్రాలకు పంపినట్లు ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం తెలిపారు. ఇటీవల జిల్లాలో నమోదైన గంజాయి కేసుల దర్యాప్తుపై ఆయన సమీక్షించారు. గంజాయి కేసుల్లో అరెస్టైన నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఆయా కేసులతో సంబంధం ఉన్న ఇతర నిందితుల లింకుల ఛేదనపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. గంజాయిని ఎక్కడ, ఎవరివద్ద కొనుగోలు చేశారు, దానికి సహకరించిన వ్యక్తులు, మధ్యవర్తులుగా వ్యవహరించిన వ్యక్తుల వివరాలు, వారు ఎవరికి విక్రయాలు జరిపేది, ఎవరు వినియోగించేది అన్న వివరాలను రాబట్టాలన్నారు. దీనికోసం ఐదుగురు ఎస్‌ఐలతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి, గంజాయి కేసులతో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తుల సమాచారాన్ని తెలుసుకుంటారని చెప్పారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల వ్యవధిలోనే జిల్లాలో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిపై 22 కేసులు నమోదు చేసి 65 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. గంజాయి సేవిస్తున్న మరో 35 మందిని, గంజాయిని తక్కువ మొత్తంలో విక్రయిస్తున్న 27మంది చిన్న వ్యాపారులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు వెల్లడించారు. బొడ్డవర వద్ద ఉన్న ఒక చెక్ పోస్టుకు అదనంగా మరో నాలుగు చెక్ పోస్టులను పాత బొబ్బిలి, పిట్టాడ, తుమ్మికాపల్లి, కొట్టక్కి వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు.

అభినవ దానకర్ణుడు డాక్టర్ పీవీజీ


స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

- మహోన్నత వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలి
- ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకావిష్కరణ

విజయనగరం: అభినవ దానకర్ణుడు డాక్టర్ పీవీజీ రాజు అని ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరంలోని కోటలో రాజా సాహెబ్ డాక్టర్ పీవీజీ రాజు జయంతి శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆయన జీవిత విశేషాలతో కూడిన స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ పుస్తకాన్ని మాన్సాస్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఆవిష్కరించగా.. కార్యక్రమంలో మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహనాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెంన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యరాణి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ ఎంపీ ఎం.భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజులు పాల్గొన్నారు. అంతకుముందు కార్యక్రమాన్ని మాన్సాస్ విద్యా సంస్థల్లో పని చేసిన పూర్వ అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం, తూ.గో జిల్లాల్లో చదువుతున్న 300 మంది ప్రతిభ గల విద్యార్థులకు ప్రతి ఏటా ఉపకారవేతనాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తన సర్వ సంపదను సామాజిక అభ్యున్నతి కోసం దానం మహోన్నత వ్యక్తి డాక్టర్ పీవీజీ రాజు అని కొనియాడారు. విద్యాభివృద్ధి కోసం ఆయన అందించిన సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. 4 సార్లు ఎంపీగా, 5 సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు రాష్ట్ర మంత్రిగా రాజకీయంగా సేవలందించిన డాక్టర్ పీవీజీ విజయనగరం ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. నేటి తరం కాకుండా రానున్న తరాల వారికి పీవీజీ ఆదర్శప్రాయమైన జీవితాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని వాఖ్యానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రఘురాజు, పాకలపాటి రఘువర్మ, ఎమ్మెల్యే బేబీనాయన, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


సత్యంనాయుడు మృతదేహం

వీరఘట్టం: పొలంలో నీరు కట్టేందుకు వెళ్లిన వీరఘట్టం మండలంలోని తలవరం గ్రామానికి చెందిన రైతు వావిలపల్లి సత్యంనాయుడు (61) విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం అనగా వెళ్లిన భర్త సత్యం నాయుడు మధ్యాహ్నం సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య చంద్రమౌళమ్మ చుట్టుపక్కల వారిని అడిగింది..ఎవరూ చూడలేదని చెప్పారు..చివరకు రాత్రి 8.30 గంటల సమయంలో భర్తను వెతికేందుకు గ్రామస్తులతో కలిసి ఆమె పొలానికి వెళ్తుండగా మార్గమధ్యంలో విద్యుత్ స్తంభం దగ్గర భర్త పడిపోయి ఉన్నాడు. ఏం జరిగిందోనని గ్రామస్తులు పరిశీలించగా చెవిలో నుంచి రక్తం కారడంతో పాటు చనిపోయినట్లు గుర్తించారు. సత్యంనాయుడు పొలానికి నీరు కట్టి తిరిగి వస్తుండగా పొలంగట్టుపై ఉన్న విద్యుత్ స్తంభం స్టే వైరు శరీరానికి తగలడంతో షాక్ కొట్టి మృతి చెందినట్లు గ్రామస్తులు భావించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై జి.కళాధర్ సోమవారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొండ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సాలూరులో గజపతినగరం వాసి మృతి

సాలూరు: గజపతినగరానికి చెందిన వ్యక్తి సాలూరు పట్టణంలో సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పట్టణ ఎస్సై సీతారాం మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఆర్‌కే హోటల్ పక్కన ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందిందని చెప్పారు. దీంతో వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు ఆ వ్యక్తి విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన బక్క తులసి(41)గా గుర్తించారన్నారు. వృత్తిరీత్యా కుటుంబంతో కలిసి విశాఖపట్నంలో ఉంటున్న ఆయన మూడు రోజుల క్రితం సాలూరు వచ్చి మద్యం మత్తులో మతిస్థిమితం లేకుండా తిరుగుతూ రాత్రి కురిసిన వర్షానికి తడిసిపోయి మరణించి ఉంటారని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.